సంక్షేమ పాలనలో చెరగని ముద్ర వైఎస్సార్

- మండపేట నియోజకవర్గంలో మహానేత మార్క్ అభివృద్ధి
- అదే ఒరవడిని కొనసాగించిన వైఎస్ జగన్
- ఏళ్లు గడుస్తున్నా వైఎస్సార్‌ను మరువని ప్రజలు
- నేడు ఆ మహనీయుని జయంతి

కపిలేశ్వరపురం: పేద, సామాన్య ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలన సాగించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే ఓర్పు, నేర్పు వైఎస్సార్ సొంతం. సీఎంగా ఎక్కడ ఉన్నా, పనిలో బిజీగా ఉన్నా సామాన్యుడు సమస్యతో వస్తే వారిని ఆప్యాయంగా పలకరించడంతోపాటు, తక్షణం వాటికి పరిష్కారం చూపి పంపించడం ఆయన నైజం. వైఎస్ పాలన, ప్రజా సమస్యలపై ఆయన స్పందించే తీరు రాజకీయ నాయకులకు ఆదర్శనీయమైంది. వైఎస్సార్ వారసత్వాన్ని పునికిపుచ్చుకుని ఐదేళ్ల పాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందించి ఆదర్శంగా నిలిచారు. వారిద్దరి పాలనలో మండపేట నియోజకవర్గంలో చరిత్రాత్మక అభివృద్ధి జరిగింది. ప్రజాపాలనకు ఆదర్శనీయుడు దివంగత వైఎస్సార్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు వాడవాడలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సంక్షేమానికి పునాదిరాయి పడమర ఖండ్రికలోనే...

వైఎస్సార్ పాలనాకాలంలో ఇందిరమ్మ పథకం పేదల సంక్షేమానికి గుండె వంటిది. ప్రతిష్టాత్మక రాష్ట్ర వ్యాప్త పథకాన్ని కపిలేశ్వరపురం మండలం పడమర ఖండ్రికలో 2006 ఏప్రిల్ 1న స్వయంగా వైఎస్సార్ ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయం సమీపంలో ఆయన చేతుల మీదుగా పథకానికి సంబంధించిన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. గ్రామంలో ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పేద లబ్ధిదారులకు పింఛను అందజేశారు. ఆ సందర్భంగా అంగర పడమర ఖండ్రిక గ్రామాల్లో పర్యటించారు. ఆయనను చూసిన ప్రజలు దేవునిగా కొలిచిన తీరు 19 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజల మదిలో పదిలంగా ఉంది. ఆ జ్ఞాపకాలను ఆయన జయంతి సందర్భంగా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. 1991లో పసలపూడిలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని వైఎస్సార్ ఆవిష్కరించారు. 1996లో ఎంపీ హోదాలో మండపేట, ఏడిదలో పర్యటించారు. 2003 నవంబర్‌లో బస్సు యాత్ర సందర్భంగా, 2004లో ఎన్నికల ప్రచారంలోనూ మండపేటలో పర్యటించారు. 2009 జనవరి 3న ద్వారపూడిలో రైల్వే ఫ్లైఓవర్ పనులకు శంకుస్థాపన చేశారు. చివరిసారిగా 2009 ఫిబ్రవరి 27న మండపేటలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. వైఎస్ హయాంలో మండపేట నియోజకవర్గంలో సుమారు రూ.500 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. సుమారు 13,858 మంది పేదలకు ఇళ్ల నిర్మాణానికి రుణాలు మంజూరయ్యాయి. అప్పటి వరకూ 4,992 మంది ఉన్న పింఛను లబ్ధిదారుల సంఖ్యను 18,428కి పెంచారు. 2,910 మందికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.8.4 కోట్ల విలువైన వైద్య సేవలను అందించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, పావలా వడ్డీ రుణాలు మంజూరు, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలకు చిరునామాగా వైఎస్సార్ జీవితం చిరస్థాయిగా నిలుస్తుంది.



2006 ఏప్రిల్ 1న పడమర ఖండ్రికలో ఇందిరమ్మ పథకం శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్



కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ (ఫైల్)

మరో అడుగు ముందుకు..

సంక్షేమాన్ని అమలు చేయాల్సిన ప్రాధాన్యతను తండ్రి పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారు. సంక్షేమం తాలూకు ఫలితాలు నేరుగా సామాన్యుల కుటుంబాలకు లబ్ధి చేకూర్చిన తీరును గమనించారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ లబ్ధిని చేకూర్చాలన్న తపనతో వైఎస్ జగన్ తన పాలనా కాలాన్ని సద్వినియోగం చేసుకున్నారు. సామాన్యుల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ లబ్ధిని అందజేసేందుకు, పారదర్శకంగా ప్రజలకు సాయమందించేందుకు ప్రత్యేకమైన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలోనూ అందుకు అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించారు. నిరుపేదలకు నివాస యోగ్యం కల్పించేందుకు ప్రైవేటు భూములను కొనుగోలు చేసి మరీ ఇళ్ల స్థలాలను అందజేశారు. తెల్లవారుజామున ఆరు గంటలకే సామాజిక పింఛను డబ్బును చేతికందించారు. ఆశ, అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులు వంటి చిరు ఉద్యోగుల వేతనాలను పెంచారు. రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయమందించారు. ఇలా అన్ని రంగాల్లో తనదైన శైలిలో తండ్రి బాటలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తూ ప్రజల మనిషిగా నిలిచారు.

సామాన్యుల అవసరాలు తెలిసిన నేత వైఎస్సార్



దేశ రాజకీయ చరిత్రలో వైఎస్సార్ చేసిన పాదయాత్ర ఓ మైలురాయి. పాదయాత్రలో ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. సామాన్యుల అవసరాలపై సంపూర్ణ అవగాహనతో వైఎస్సార్ ఉండేవారు. ఆయన పాలన అంతా జనరంజకంగా సాగింది. నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా వైఎస్సార్ పాలనలో జరిగిన అభివృద్ధి కనిపిస్తుంది.

– రెడ్డి రాజుబాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, మండపేట

మంచిని ఓడించేందుకు వంచనతో కూటమి

గతంలో వైఎస్సార్, 2019 నుంచి ఐదేళ్లపాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పాలన అమలు చేసి చూపించారు. అదే మంచి కొనసాగితే ఇతర పార్టీల ఉనికి గల్లంతవుతుందన్న అంచనాతో వైఎస్ జగన్‌ను ఓడించేందుకు కూటమి కట్టారు. రాజకీయ విధానాలను పక్కన పెట్టి టీడీపీ ఒంటరిగా పోటీ చేయలేక జనసేన, బీజేపీలతో కూటమి కట్టింది. కళ్ల ముందు అమలు చేసి చూపించిన సంక్షేమాన్ని ప్రజలు మర్చిపోయే స్థాయిలో నోటికొచ్చిన హామీలను ఇబ్బడి ముబ్బడిగా ఇచ్చారు. అధికారం చేపట్టాక ఆ హామీలను కూటమి నాయకులు గాలికి వదిలేశారు. ఏడాది కాలంలో సామాజిక పింఛన్లు తప్ప మరే ఆర్థిక లబ్ధి ప్రజలకు అందించలేదు. 20 లక్షల ఉద్యోగాలిస్తామన్న హామీ ఇప్పటి వరకూ అమలు కాలేదు. నిరుద్యోగ భృతి ఊసెత్తడం లేదు. మహిళలకు ఉచిత బస్సు ఊరిస్తూనే ఉంది. ఈ తరహా పాలన గత వైఎస్సార్, వైఎస్ జగన్ పాలనకు భిన్నంగా ఉందన్న సంగతి ఏడాది కాలంలోనే రాష్ట్ర ప్రజలు గ్రహించారు. కార్మికులు, చిరుద్యోగులంతా రోడ్లపై ఆందోళనకు దిగుతున్నారు. మడమ తిప్పని, మాట తప్పని పాలన సాగించిన నేతగా వైఎస్సార్ నేటికీ ప్రజల గుండెల్లో కొలువయ్యారు. నేడు ఊరూ వాడా ఆయన జయంతిని జరుపుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

ప్రతిభ చాటితే ఉజ్వల భవిష్యత్తు

కపిలేశ్వరపురం (మండపేట): ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులు తమ ప్రతిభను చాటి ఉజ్వల భవిష్యత్తును అందిపుచ్చుకోవాలని పలువురు వక్తలన్నారు. మండపేట మండలం ఏడిద జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సోమవారం గ్రామస్తులు పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థులు మల్లిపూడి జాహ్నవి, ఆడబాల విజయ, పి.యశస్విని, బైపీసీలో ప్రతిభ కనబర్చిన పతంగి రమ్యశ్రీ, ఎంపీసీలో ప్రతిభచూపిన కొమ్ము శైలజ, సీనియర్ ఇంటర్ విద్యార్థిని కోసూరు షాలిని తదితరులను గ్రామ పెద్దలు సన్మానించారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ నూతిక రాజేష్, హెచ్ఎం చింతా జయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పర్వతిన వీర్రాజు, రిటైర్డ్ హెచ్ఎం గెడా శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర వలంటీర్ల విభాగం జోనల్ అధ్యక్షుడిగా శేఖర్



కాజులూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర వలంటీర్ల విభాగం జోనల్ అధ్యక్షుడిగా తాను ఎంపికై నట్టు కాజులూరుకు చెందిన కట్టా రామశేఖర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వెలువడిన నివేదికల ప్రకారం తనను రాష్ట్ర వలంటీర్ల విభాగం జోనల్ అధ్యక్షుడిగా నియమించినట్టు పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ప్రకటించారన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అంకితభావంతో పనిచేస్తానని, పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తానన్నారు.

వైఎస్సార్ జయంతికి ఏర్పాట్లు పూర్తి



మొగలిపాలెంలో మహానేత మందిరం

కాజులూరు: మండల గ్రామాల్లోని వాడవాడలా నేడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలను శుభ్రపరచి సుందరంగా అలంకరిస్తున్నారు. జిల్లాలో మొట్టమొదటి వైఎస్సార్ మందిర నిర్మాణం జరిగిన మొగలిపాలెంలో ఉదయం ఎనిమిది గంటలకు మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సేవాకార్యక్రమాలు చేపట్టనున్నట్లు పార్టీ జిల్లా నాయకుడు కర్రి బస్విరెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామచంద్రపురం రూరల్: ఆరోగ్యంతో ఉన్న అసోసియేషన్‌లో ఉన్న సభ్యుడికి రామచంద్రపురం ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ హెల్పర్ అసోసియేషన్ సంఘ నాయకులు, సభ్యులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. సంఘానికి చెందిన పెంకే శివప్రసాద్‌కి హార్ట్‌సర్జరీ జరగడంతో సహచర సంఘ నాయకులు సభ్యులు బాధిత కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రామచంద్రపురం జోన్ అధ్యక్షుడు మద్దిరెడ్డి వరిప్రసాద్, కార్యదర్శి వీరబాబు, మాజీ అధ్యక్షులు గాదం మధుసుదన్‌రావు, మాజీ కార్యదర్శి వెంకన్న, సభ్యులు ఆచారి యండమూరి ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉట్రుమిల్లి గ్రామానికి చెందిన గాదంశెట్టి లక్ష్మీ నారాయణ కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో సోమవారం రామచంద్రపురం ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల చెక్కు అందజేశారు. లక్ష్మీనారాయణ కాలేయ సంబంధిత వ్యాధితో బతుకు పోరాటం చేస్తున్నాడంటూ గ్రామానికి చెందిన ప్రజలు మంత్రి సుభాష్‌కు కలసి అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో బాధితుని సమస్యపై స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారసు చేశారు. ఆయన సిఫారసు మేరకు మంజూరైన చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు మంత్రి అందజేశారు.

సబ్సిడీపై డ్రోన్లు అందజేత

కపిలేశ్వరపురం (మండపేట): ఆధునిక సాంకేతికత వినియోగంతో వ్యవసాయం లాభదాయకమవుతుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు డ్రోన్లు పంపిణీ చేశారు. మండపేట మండలానికి సంబంధించి శ్రీజనార్ధన స్వామి ఆగ్రో టెక్ సీహెచ్‌సీ గ్రూప్, రాయవరం మండలం చెల్లూరుకు చెందిన శ్రీ వరలక్ష్మి కిసాన్ సీహెచ్‌సీ గ్రూప్‌లకు ఒక్కొక్క డ్రోన్ చొప్పున అందజేశారు. మండల వ్యవసాయాధికారి కె. ప్రభాకర్ మాట్లాడుతూ డ్రోన్ ఖరీదు రూ.9.80లక్షలని, ప్రభుత్వం 7,84,000 సబ్సిడీ ఇస్తుందన్నారు. రైతు వాటా రూ.1,96,000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ఏఎంసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, వైస్ ఎంపీపీ పసుమతి నాగబాబు, రాయవరం ఏఓ కేవీఎన్ రమేష్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే సహించేది లేదు

కలెక్టర్ మహేష్‌కుమార్

రామచంద్రపురం: ప్రజల నుంచి స్వీకరించే అర్జీల పరిష్కారంలో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను హెచ్చరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 6 అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారం లభిస్తుందని ఎంతో ఆశతో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆశ్రయిస్తున్నారన్నారు. వారి నమ్మకానికి మరింత బలం చేకూర్చే విధంగా అర్జీదారుడు సంతృప్తి కొలమానంగా పూర్తి స్థాయిలో సమస్యకు పరిష్కారం చూపాల్సిందేనని, ఏ మాత్రం అలసత్వం వహించినా సహించబోమన్నారు. మానవతా దృక్పథంతో సానుకూలతతో సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలన్నారు. స్వీకరించిన అర్జీలకు సంబంధించి కింది స్థాయి అధికారులు సిబ్బంది నుంచి స్పష్టమైన సమాచారం తీసుకొని సమస్యలను పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచడమే లక్ష్యంగా అధికారులు పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. అర్జీల పరిష్కారంపై ప్రతి వారం సమీక్ష నిర్వహించడం జరుగుతుందని అర్జీల పరిష్కారంలో సరైన కారణం లేకుండా జాప్యం జరిగినా, నాణ్యత లేకున్నా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో దేవరకొండ అఖిల, కార్యాలయం పరిపాలనాధికారి బీవీఎస్ భాస్కరరావు, డీఎల్డీవో విజయలక్ష్మి, డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఆర్డీవో అఖిల

పట్టణంలో సుడిగాలి పర్యటన

డంపింగ్ యార్డ్ నిర్వహణ అనేది పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యానికి అత్యంత కీలకమైన అంశమని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ మున్సిపల్ అధికారులకు సూచించారు. పట్టణంలో కలెక్టర్ పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. అందులో భాగంగా ఎన్నో ఏళ్లుగా సేకరించిన చెత్తను తరలించిన డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్, స్థానిక మున్సిపల్ అధికారులు ఆర్డీవో డి.అఖిలతో కలసి సంయుక్తంగా సందర్శించారు. సమర్థవంతమైన నిర్వహణ లేకపోతే డంపింగ్ యార్డులు తీవ్రమైన సమస్యలు సృష్టించి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. పేరుకుపోయిన చెత్తను లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ చేసి ఆ చెత్త నుంచి మట్టి, ప్లాస్టిక్, ఇతరాలు వేరు చేసే ప్రాసెసింగ్ పరికరాన్ని పరిశీలించి వేరు చేసే ఏజెన్సీ అయిన తరుణి ఏజెన్సీస్ కాంట్రాక్టర్ వారితో 22,500 టన్నుల చెత్త త్వరగా ప్రాసెసింగ్ చేయాలని ఆదేశించారు. స్థానిక పురపాలక సంఘంలో రోజూ ఎంతమేర చెత్త సేకరణ జరుగుతుంది అనే విషయాలు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజును అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తలు పునర్వినియోగం రీసైక్లింగ్ ప్రాపర్‌గా నిర్వహిస్తూ ఎటువంటి దుర్గంధం జనావాసాలకు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. డంపింగ్ యార్డ్ నుంచి క్రిమికీటకాలు వ్యాప్తి చెందకుండా క్రిమిసంహారక చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం స్థానిక ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న మహాత్మ జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల వసతిగృహాన్ని ఆయన సందర్శించారు. దోమల నుంచి రక్షణ కోసం వసతి గృహ కిటికీలకు, గుమ్మాలకు దోమల మెస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వసతి గృహంలో వసతి పొందుతున్న 134 మంది బాలికల వ్యాయామం కోసం పక్కనే ఉన్న మున్సిపల్ పార్కులో కొంతమేర స్థలాన్ని కేటాయించి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి బాలికల కొరకు క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులు ఆదేశించారు. అనంతరం అన్న క్యాంటీన్ నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ వసతిగృహ అధికారులు, తహసీల్దార్ బి.మృత్యుంజయరావు, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాడాలి

కపిలేశ్వరపురం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల తరఫున కృషి చేయాలని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అన్నారు. అంగరలో పార్టీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాయకత్వంలో మండలంలోని 19 గ్రామాల్లో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయాలన్నారు. కూటమి ఏడాది పాలనలో సామాన్య, పేద ప్రజలు అనేక సంక్షేమ పథకాలకు దూరమయ్యారని, వలంటీర్లు, ఎండీయూ నిర్వాహకులు ఉపాధిని కోల్పోయారన్నారు. పార్టీ సీనియర్ నాయకులు గూటం సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి పాలనలో దళిత, బలహీన వర్గాలతో పాటు ఆర్థికంగా వెనుకబాటున ఉన్న ఇతర సామాజిక వర్గం ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ పలివెల మధు, యాక్టివిటీ సెక్రటరీ గుడిమెట్ల శివరామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ కూటమి ప్రభుత్వంపై ప్రజలు తరఫున ఒత్తిడి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అద్దాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, వాసంశెట్టి విష్ణు, పాలింగి కృష్ణ కిశోర్, రాయుడు జగపతి, పాలింగి శ్రీనివాస్, పేరాబత్తుల రామకృష్ణ, పట్నాల పట్టాభిరామయ్య, అతికెల శంభులింగం పాల్గొన్నారు.



అంగరలో మండల స్థాయి సమావేశంలో అబ్బు, గూటం సత్యనారాయణ

మండపేట మున్సిపాలిటీకి ప్రశంసలు

కపిలేశ్వరపురం (మండపేట): శానిటేషన్ విభాగంతో పాటు పలు అంశాల్లో మండపేట మున్సిపాలిటీకి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు దక్కాయి. పురపాలక శాఖ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేలో మండపేట మున్సిపాలిటీ శానిటేషన్ విభాగం పనితీరును సోమవారం వీసీ ద్వారా ఉన్నతాధికారులు అభినందించారు. రాష్ట్రంలోని 77 మున్సిపాలిటీల్లో మండపేట మున్సిపాలిటీకి ప్రథమ స్థానం దక్కినట్టు పురపాలక శాఖ కమిషనరు పి.సంపత్‌కుమార్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మండపేట మున్సిపల్ అధికారులకు తెలిపారు. కమిషనర్ టీవీ రంగారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజినీర్లకు పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

రామచంద్రపురం: పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల ప్రజా వేదిక కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌కు పీడీఎస్‌యూ విద్యార్థి బృందం వినతి పత్రం సమర్పించింది. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐటీఐ, డిగ్రీ, బీ-ఫార్మసీ, ఇంజినీరింగ్ కాలేజీల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ ఇతర పేద విద్యార్థులు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరం గడుస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సమీక్ష జరపకుండా, ఇంజినీరింగ్ యాజమాన్యాలు విద్యార్థుల హాల్‌టికెట్లు, సర్టిఫికెట్లు ఇవ్వకుండా బెదిరిస్తున్నాయని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న రూ.6 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ పథకాన్ని అమలు, జీవో 77ని రద్దు చేసి పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేయాలని, అన్ని అర్హత కలిగిన విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం డివిజన్ నాయకులు ఎం.కిరణ్ సంజయ్, బి.లక్ష్మీనారాయణ, ఎం.వసంత్, మణిదీప్, పి.ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి బృందం

ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం



రాయవరంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

రాయవరం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని రాయవరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘ జిల్లా కమిటీ సభ్యుడు లంక చందు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, లంక చందు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ పోరాటం ఫలితంగానే రాష్ట్రంలో అన్ని కులాలకు ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. తొలుతగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, బాబూజగ్జీవన్‌రామ్, రాయవరం మునసబు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు మందపల్లి నాగేశ్వరరావు, చంద్రమళ్ల యాకోబును ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కటకం చిన్నారావు, మచ్చా అబ్బులు, మందపల్లి మణి, చంద్రమళ్ల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి ఎమ్మార్పీఎస్ విశేష కృషి

కపిలేశ్వరపురం: సమాజాభివృద్ధికి ఎమ్మార్పీఎస్ విశేష కృషి చేసిందని సోమవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. కపిలేశ్వరపురంలో సోమవారం గ్రామ మాదిగ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను సంఘ పెద్దలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లిపూడి శివకుమార్ మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా స్థాపించిన ఎమ్మార్పీఎస్ అనేక ఇతర సామాజిక వర్గాల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో పలివెల వెంకట్రావు, ముమ్మిడివరపు పెద సత్యం, చినసత్యం తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని సూర్య కన్వెన్షన్ హాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులు, నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకులు, అనుబంధ ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు.

ఏటిగట్టును పరిశీలించిన ఆర్డీఓ

కె.గంగవరం: గోదావరికి వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో సోమవారం రామచంద్రపురం ఆర్డీఓ అఖిల కె.గంగవరం మండలంలోని గోదావరి ఏటిగట్టు పరివాహక ప్రాంతాలను ఆమె పరిశీలించారు. సుందరపల్లి, కూళ్ల గ్రామాల్లో ఉన్న ఏటిగట్టు బలహీనంగా ఉండడంతో అధికారులను ఆమె అప్రమత్తం చేశారు. ముందు జాగ్రత్తగా బలహీనంగా ఉన్న చోట్ల వెంటనే ఇసుక బస్తాలను ఉంచాలని కోరారు. సుందరపల్లి వద్ద మరింత బలహీనంగా ఉన్న గట్టుకు ఇసుక బస్తాలు వేసి కర్రలతో పటిష్టం చేయాలని ఆమె సూచించారు. ఏటిగట్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరికి మరింత వరద నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది గట్టు వెంబడి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏటిగట్టు పరివాహక గ్రామాల్లో గట్టు వద్ద పహారా నిమిత్తం పోలీసులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఇప్పటికే పంటు ప్రయాణాన్ని పరిశీలించి నిలుపుదల చేస్తామన్నారు. లంకల్లో ఉన్న పశువులను రైతులు వెంటనే గట్టుకు చేర్చాలన్నారు. పీడబ్ల్యూడీ ఏఈ సుందర్‌సింగ్, వీఆర్ఓ స్వామినాయుడు, ఆర్ఐ నరాల వెంకట్రావు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సుందరపల్లి వద్ద గట్టును పరిశీలిస్తున్న ఆర్డీఓ

ప్రజా సమస్యలపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు

కాజులూరు: ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని ఏపీ కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. సోమవారం మండలంలోని కోలంక, దుగ్గుదుర్రు తదితర గ్రామాల్లో రాజబాబు తదితర నాయకులు పర్యటించి రైతులు, కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల తొమ్మిదో తేదీ బుధవారం వామపక్షాల ఆధ్వర్యంలో జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కోలంకలో రైతులు, వ్యవసాయ కూలీలతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు ప్రతి ఒక్కరూ సమ్మెలో పాల్గొని మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు నందికోళ్ళ సత్తిబాబు, దవులూరి సత్యారావు, చల్లా సత్తిబాబు, రాయుడు రవి, కనుమూరి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.





